

నవల

# కాశీపట్నం చూడర బాబూ!

మణి వడ్లమాని

**Kasipatnam Chudarababu** - Novel
(Serialised in Jagruti Weekly)
by **Mani Vadlamani**

First Edition: June, 2018

ISBN No.: 978-93-5311-517-3

© Author

For Copies & Address :
**Mani Vadlamani**
2-2-185/53/3, Street No. 13.
Opposite Sai Dutta Hospital, Somasundar Nagar,
Bagh Amberpet, HYDERABAD-500013.
Ph: 9652067891
email: vadlamani.manimurthy@gmail.com

Copies: 500

Book Price : Rs. 100/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

Cover design:
**Ramakrishna Pukkalla**
**Mahy Bezawada**

Type Setting:
**K. Ravi Prabha**, Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,** Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

& All Major Book Shops

# కాశీపట్నం చూడర బాబు

ఉదయం తొమ్మిదిన్నర గంటలు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారం మీదకి రైలు వస్తున్నట్లుగా రైల్వేస్టేషన్ వారి అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఇక మొదలయింది జనాలలో హడావుడి, కంగారు. రైలు చాలాసేపు ఆగుతుందని తెలుసు. అయినా సరే.. ఎవరికి వారు తామే ముందు ఎక్కాలనే తాపత్రయం. అది మూడో తరగతి ఏసి కంపార్ట్‌మెంట్. ఇంతంత పెట్టెలేసుకొని ఎక్కుతూ ఆ తొందరలో అవతల వాళ్ళ కాళ్ళు చేతులు, ఒక్కోసారి మొహాలు కూడా పచ్చడయిపోతున్నా పట్టించు కోకుండా ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు. ఎక్కినవాళ్లు మళ్ళీ దిగుతున్నారు. అంతా గందరగోళంగా ఉంది. అలాంటి అవస్థ పడుతూ రాజారావు, శ్యామల బండిలోకి ఎక్కారు. వాళ్ళ సీట్ నంబర్లు సరిగ్గా చూసుకొని స్థిమితంగా  కూర్చున్నారు.

'ఇదిగో.. అస్తమానం కిందకి దిగకండి. ఇంకొకటి కూడా చెబుతున్నా! ఎవడయినా ఏసి తగ్గించమన్నా, ఫ్యాన్లు ఆపేయమన్నా నేను అస్సలు ఊరుకోను. వెధవది అంతమంది కూర్చుంటాము, అన్ని రకాల వాసన్లు వస్తాయి. కాబట్టి ఏసి చాలా అవసరం. ఈ విషయంలో నేను చచ్చినా సర్దుకుపోను. మీరు మాత్రం నా నోరు నొక్కకండి' అని అల్టిమేటం ఇచ్చింది శ్యామల తన భర్త రాజారావుకు.

'అలాగేలేవే! కాకపోతే తరువాత ఆ మాట నువ్వే చెబుతావు 'చాలా చల్లగా

అయిపోతుంది బోగి, ఏసి తగ్గించండి!' అని. అయినా అస్తమానం ఎవరూ రారులే!' అంటూ కిందకు దిగి నించున్నాడు రాజారావు.

'ఈ మధ్య టూర్ ఆపరేటర్స్ దేశమే కాదు, ప్రపంచంలో ఎక్కడికైనా తీసుకెళు తున్నారు. వాళ్ళకి ఇంత డబ్బు కట్టేస్తే సరి. అలాంటిది ఈ కాశీ ఓ లెఖ్ఖా!' అంటూ పెదవి విరిచాడో పెద్దాయన.

'అవునండీ! నిజానికి మనం సీనియర్ సిటిజన్స్‌మి కదా! అయ్యా క్షమించాలి, మిమ్మల్ని కూడా నాతో కలిపేసాను' అన్నాడు ఇవతలి పెద్దాయన కాస్త నొచ్చుకుంటూ.

'అబ్బే పర్వాలేదు లెండి! నేనూ అరవయిలో పడ్డవాడినే!' అని తన షార్ట్స్ వంక చూసుకుంటూ అన్నాడు అవతలి పెద్దాయన.

'అదే ఇంతకీ నే చెప్పేదేమిటంటేనండీ! అసలు రెండో (సెకండ్) ఏసిలోనే వెళ్ళేవాడిని. కాని మా ఆవిడ 'అందులో మీ గురక తప్ప నాకు ఇంకోటి వినిపించదు, అదిగాక తక్కువమంది ఉంటారు, పైగా తెరలు వేసేసుకుంటారు. అదే మూడో (థర్డ్) ఏసిలో అయితే తోటి ప్రయాణీకులతో సరదాగా కబుర్లు చెప్పుకోవచ్చు. పైగా ప్రయాణం కూడా సరదాగా ఉంటుంది. అందుకని ఇందులోనే బుక్ చేయండి' అంది' అని నిజాయతీగా అసలు సంగతి చెప్పేసాడు ఇవతలి పెద్దాయన. దానికి అవతలాయన 'అవునండీ! అక్కయ్యగారు చెప్పింది నిజమే' అంటూ వరుస కలిపేసాడు. ఆపై ఇద్దరూ ప్రాణస్నేహితుల్లా కలసిపోయి లోకాభి రామాయణం మొదలెట్టారు.

ఆ పక్కనే నించొని వాళ్ళ మాటలు విన్న రాజారావుకి నవ్వొచ్చింది. ఎవరో అన్నట్లు 'నిజంగానే రైలు ప్రయాణం ప్రతి వ్యక్తికీ ఓ వింత అనుభవం కలిగిస్తుంది' అనుకున్నాడు. కొంచెం సేపు కింద నించొని, ఆపైన కాళ్ళు పీకుతుంటే లోపలకి వెళ్లి కూర్చున్నాడు. లోపలకి ఎక్కేవాళ్ళని చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. ఆ తలుపులు అస్తమానం టపటపా వెయ్య, తియ్య. ఈ మూడో ఏసి బోగీలో ఇదో గోల అనుకున్నాడు.

అప్పుడే లోపలికి జీన్ ప్యాంటు, టీ షర్టు వేసుకున్న ఓ అమ్మాయి వచ్చింది. చేతిలో పెద్ద ఫోన్, చెవిలో ఇయర్ ఫోన్స్, ఈ పక్కనున్న ఆరు బెర్తులలో కాకుండా



దాని ఎదురుగా ఉన్న సైడ్ లోయర్‌కి వెళ్లి తన ట్రాలీ బ్యాగ్‌ని సీట్ కిందకి చేర్చి సీట్లో కూర్చుంది.

ఏదో ఫోన్ వచ్చినట్లుంది. ఇయర్ ఫోన్స్ తీసేసి మాట్లాడుతోంది. అవతల వాళ్ళు అడిగిన దానికి 'ఎస్ శంఖరూప హియర్' అని ఏదో మాట్లాడుతోంది.

ఆ పక్క భాగంలో ఉన్న 8 బెర్తులలో మొత్తం ఎనిమిదిమంది ఏదో కళాశాల విద్యార్థులు కాబోలు. నలుగురు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు. ఉరికే జలపాతంలా ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళ మాటలు, అల్లరితో బోగీని అదర గొట్టేస్తున్నారు. 'బాబోయ్! వీళ్ళు కూడా కాశీ వస్తున్నారా? ఇంక అయినట్లే ఈ ప్రయాణం! అసలే కుర్రాళ్ళు! ఇక వాళ్ళ అల్లరికి హద్దే ఉండదు. అంతా గొడవగానే ఉంటుంది. రాత్రికి ఈ పిల్లమూక సరిగ్గా పడుకోనిస్తారో? లేదో?!' అనే అనుమానంతోపాటు ఇప్పటినుంచే దిగులు కూడా పట్టుకుంది రాజారావుకి వాళ్ళని చూసి.

ఇంతలో ఒక యువకుడు మెల్లగా ఒక పెద్దావిడని తీసుకొస్తున్నాడు. పెద్దావిడ వయసు ఎనభై పైన ఉండొచ్చు. 'నేను నడుస్తానురా రిత్విక్, పర్వాలేదు' అంటోంది పెద్దామె. ఆ అబ్బాయి ఆవిడని దగ్గరుండి బోగీలోకి ఎక్కించాడు. ద్వారం పక్కనే ఉన్న సైడ్ బెర్తులో కూర్చోబెట్టి, ద్వారం దగ్గర నుంచుని తనతో వచ్చిన వాళ్ళ

చేతుల్లోని బ్యాగ్‌లు అందుకున్నాడు. కేప్రి, టీ షర్టు వేసుకున్న అమ్మాయి తిడుతోంది 'ఎంతసేపటికీ రావేమిటిరా!' అని. 'అబ్బా అక్కా! నువ్వు ఈ పెద్దావిడని పట్టుకొని రావలసింది, నన్ను అస్సలు బయటి కదలొద్దని అంటోంది' అన్నాడు.

వాళ్ళ మాటలు పూర్తి కాలేదు. వాళ్ళ అమ్మా, నాన్న కూడా వచ్చారు లోపలకి. అందరూ జాగ్రత్తగా సర్దుకొని తమ సీట్లలో కూర్చున్నారు. 'బావుంది! నా మనవడు చక్కగా దగ్గరుండి కాశీయాత్ర చేయిస్తున్నాడు నాతో' అంటూ మనవడి బుగ్గలు పుణికింది బామ్మ. ఆ కుర్రాడు తెగ సిగ్గు పడ్డాడు. వాళ్ళ అక్క అయితే ఒకటే నవ్వులు. వాళ్ళ అమ్మ, నాన్న ఏదో మాట్లాడుకుంటున్నారు.

'ఈ వయసులో కూడా బామ్మగారు భలే హుషారుగా ఉంది కదండీ' అంది శ్యామల భర్తతో. అవునన్నట్లుగా తలూపాడు రాజారావు.

ఆ బోగీలోనే ఇంకొంచెం ముందుకు వెళితే అక్కడ ఉన్న ఆరు సీట్లలో నాగభూషణంగారు కూర్చొని తన ఎదురుగా కూర్చున్న జంటని గమనిస్తున్నారు. ఆమె ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది. ఆ మాటల వల్ల తెలిసింది. ఆ జంటలో అతని పేరు విజయ్, ఆమె పేరు పద్మజ. బహుశా అతనికి ఆరోగ్యం బాగాలేదు అని ఆమె మాటల్లో తెలుస్తోంది. అంతకంటే వివరాలు తెలియవు.

ఇంచుమించుగా ఆ బోగీలో అందరూ కాశీ వెళ్ళేవారే.

ఆ బోగీలోనే మరి కాస్త ముందుకు వెళితే కిటికీ దగ్గరగా రమేశ్, జయ దంపతులు కూర్చుని ఉన్నారు. కిందటి ఏడాది రమేశ్ నాన్నగారు కాశీలోనే పోయారు. గిర్రున ఏడాది గడచిపోయింది. సంవత్సరీకాలు పెట్టడానికి మళ్ళీ కాశీ వెళుతున్నారు ఆ దంపతులు. రమేశ్ తండ్రి పోయినప్పుడు కర్మ చేయించిన కృష్ణశాస్త్రిగారే ఇప్పుడు కూడా ఈ కార్యక్రమం చూసుకుంటున్నారు. అంతవరకు ఏం దిగులు లేదు. కాని రమేశ్ మనసులో మాత్రం ఏదో అలజడి. ఏడాది పూర్తయినా తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. జయ ఎంత మాట్లాడిస్తున్నా ముక్తసరిగానే ఉంటున్నాడు.

'ఒరేయ్ చందూ! ఆ కృష్ణశాస్త్రి ఎవరినైనా పంపిస్తానని చెప్పాడు. వాడు వచ్చేంతవరకు ఎక్కడకీ వెళ్ళకు. ఎలాగోలా వాడి చేతికింద ఉండి పని నేర్చుకుని నాలుగు డబ్బులు సంపాదించుకోరా! ఉంటాను. దిగగానే ఫోన్ చెయ్యి. అలా అని అస్తమానం చెయ్యకు. డబ్బులయిపోతాయి. జాగ్రత్తగా ఉండు. నేను బ్యాంకు

కాలనీ అవధానిగారింటికి వెళ్ళాలి. ఇవాళ వాళ్ళ అమ్మగారి ఆబ్దికం. ఇప్పటికే ఆలశ్యం అయింది' అంటూ కొడుకు చంద్రశేఖర దీక్షితులుకి జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు సుబ్బన్న దీక్షితులు. ఈ కుర్రాడు మరో కాశీ ప్రయాణీకుడు. ఒంటరిగానే వెళుతున్నాడు.

వెళ్ళిపోతున్న తండ్రి వైపు జాలిగా, బాధగా చూసాడు చంద్రశేఖర దీక్షితులు. కొడుకుని కాశీలో ఉంటున్న తన భార్య వైపు బంధువైన కృష్ణశాస్త్రి దగ్గరకి పంపుతున్నాడు సుబ్బన్న దీక్షితులు. ఆన్‌లైన్‌లో తెలిసిన వాడి చేత బుక్ చేయిస్తే వాడు కాస్త ఏసి టికెట్టు బుక్ చేసేసాడు. ఏదో ఆ రుక్మిణమ్మగారి పుణ్యమా అని ఆ ఖర్చు ఆవిడ పెట్టుకుంటానని చెప్పడం వల్ల కాస్త కుదుటపడ్డాడు సుబ్బన్న దీక్షితులు.

ఇంతలో రైలు చిన్న కుదుపు ఇచ్చి బయలుదేరింది.

రైలు కదలగానే రాజారావు గట్టిగా 'జై విశ్వనాథ బాబాకి, జై కాశీనాథునికి' అనగానే ఇంకెవరో బాలసుబ్రమణ్యం పాడిన విశ్వనాథాష్టకం మొదలుపెట్టారు. దానితో కొంతమంది శృతి కలిపారు. వీళ్ళ గొంతులు వినగానే బామ్మగారు భక్తితో దండం పెట్టుకుంది. 'శివ శివా! నాయినా! చేదుకోవయ్యా!' అంది. ఆ పక్క భాగంలో ఉన్న కుర్రగ్యాంగ్ 'హర హర మహాదేవ్' అంటూ గట్టిగా నినాదాలు చేసారు. కొంతసేపు ఆ బోగీ భక్తితో ఊగిపోయింది.

రైలు కదిలింది, ఇక ఆత్మారాముడి గోల చూడాలి! అనుకుంటూ కొంతమంది తినుబండారాల మీద పడ్డారు. మరి కొంతమంది కబుర్లు చెప్పుకుంటున్నారు. కిటికీల దగ్గర కూర్చున్నవాళ్ళు అద్దాలలోంచి బయటకు చూసే ప్రయత్నం చేస్తున్నారు. రైలు ధన్ ధన్ ధన్ అని శబ్దం చేస్తూ వెళ్తోంది.

'కాశీ నగర పంచకోశ మధ్యంలో గల తీర్ధ సముదాయాలలో ఉన్న జాహ్నవి సారభూతమైనది. జాహ్నవీ తీర్థాలలో మణికర్ణిక మహా గొప్పది. మణికర్ణికా తీర్థంలో చేసే స్నానఫలం ఇంకా గొప్పది. దానికంటే కూడా శ్రీ విశ్వనాథుని దర్శన ఫలం చాలా గొప్పది' అని శ్రీనాథకవి చెప్పినట్టు – జీవితములో ఒక్కసారైనా ఆ కాశీనాథుని దర్శనం చేసుకోవాలని, పవిత్రగంగలో మునగాలనే కోరిక అక్కడున్న ప్రతివాళ్ళలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

మహిమాన్వితమై, గంగానది స్పర్శతో పునీతమైన కాశీపట్టణం చూడటానికి

బయలుదేరిన లక్షలమందిలో కొందరైన రాజారావు-శ్యామల, నాగభూషణం, బామ్మగారి కుటుంబం, విజయ్-పద్మ, శంఖరూప, రమేశ్-జయ, చంద్రశేఖర దీక్షితులు, కళాశాల విద్యార్థుల బృందం, మరి కొంతమంది ఎప్పుడెప్పుడు కాశీ చూస్తామా! అని ఉవ్విళ్ళూరుతున్నారు.

❖ ❖ ❖

ప్రయాణం జీవితంలా మొదలవుతుంది. జీవితం కన్నా ఒక్కోసారి ప్రయాణాలే బాగుంటాయి. జీవితం అనే ఈ రైలు ప్రయాణంలో ఎన్నెన్నో మలుపులు, కొత్త వ్యక్తులు, కొత్త పరిచయాలు, కొత్త అనుభూతులు. ఎవరికీ పక్కవారితో పరిచయం లేదు. ఏ సంబంధమూ లేని వీళ్ళందరినీ కాశీ వెళ్ళే బోగీలో కలిపిన ఆ సూత్రం ఏమిటి? అసలు కాశీ ప్రయాణం చేయాలనే ఆలోచన, సంకల్పం, అవసరం ఒక్కొక్కరికి ఎలా కలిగాయి? అదెలా కుదిరింది? వాటి వెనకున్న జీవిత సత్యాలేమిటి?

ఒక్కో జీవితం ఒక్కో తరంగమై, ఈ జీవనగంగలో ఎగిసిపడుతూ సాగే ఈ జీవనయానంలో చిత్రంగా తారసపడే మనుషులెందరో? అంతేకాదు.. సాధారణంగా కథలన్నీ కంచికి చేరతాయంటారు. కానీ ఈ బోగీలోని వ్యక్తుల కథలన్నీ కాశీకి చేరుతున్నాయి. అక్కడికి చేరే లోపల వీళ్ళ జీవితాల గురించి తెలుసుకుందాం! అలా తెలుసుకోవాలంటే కొన్ని రోజులు వెనక్కి వెళ్లాల్సిందే.

❖ ❖ ❖

**నాగభూషణంగారు**

బోగీలోని వారిలో కొంతమంది కుటుంబంతో ప్రయాణిస్తుంటే, కొంతమంది తాము ఒక్కరే వచ్చారు. అలా ఒక్కరుగా వచ్చినవారిలో నాగభూషణంగారు ఒకరు.

నాగభూషణంగారికి భవిష్యత్ అంతా చీకటిగా కనిపిస్తోంది. నలభై ఏళ్ళ పాటు తోడూ-నీడలా కలసి ఉన్న తన ఇంటిదీపం, జీవనసహచరి పార్వతి పోయినప్పుడు కూడా బాలన్స్‌గా ఉన్నారే తప్ప బేలగా అయిపోలేదు.

'అసలు ఈ జీవితమే ఓ తమాషా రంగుల చిత్రంలా అనిపిస్తుంది. చిన్నతనంలో సప్తవర్ణాలతో ఉన్న ఇంద్రధనుస్సులా అనందంగా; యవ్వనమూ, మధ్య వయస్సులో ఉత్సాహం, ఉద్రేకంతో ఉరకలెత్తే ఎర్రటి నెత్తురులా కణకణ మంటూ ఉండే ఈ జీవితం వృద్ధాప్యంలో గడచిపోయిన జ్ఞాపకాలతో, గతించిన

వైభవం తాలూకు అనుభవాలతో నల్లరంగు పులుముకొంటుంది' అని తన స్నేహితుడు సూర్యం అంటుంటే తనకు చిరాకు వేసేది.

నిజానికి నాగభూషణంగారి నైజానికి ఈ మాటలు సరిపోవు. ఎప్పుడూ జీవితాన్ని క్రమశిక్షణతో, ఒక క్రమపద్ధతిలో నడపటమే ఆయనకు తెలుసు. దుఖం ఉన్నా, దానిని గుండెలో దాచుకోవడమే తప్ప ఎప్పుడూ ఎక్కడా వ్యక్త పరచలేదు.

పిల్లలు పెద్దై, వారి పెళ్ళిళ్ళు కూడా అయ్యాక, ఎవరి సంసార గొడవలో వాళ్ళుంటారు. నిజమే! ఒంటరితనం తప్పదు. మనసులో మాట చెప్పుకోవడానికి, వినేవాళ్ళు ఉండరు. వీటన్నిటిని ముందే ఊహించారు నాగభూషణంగారు. అయితే కొద్ది రోజులుగా పిల్లల్లో తను ఊహించని మార్పును గ్రహించారు. వాళ్ళు ప్రవర్తించే విధానం చూసి తను జాగ్రత్తగా ఉండాలనుకున్నారు.

మొన్నటికి మొన్న పెద్దకోడలు సుందరి మాటలు వింటుంటే 'ఛీ ఛీ! మనుషులు ఊసరవెల్లిలాగా ఇన్ని రంగులు మారుస్తారా!' అనిపించింది. పార్వతి పోయిన తరువాత నాగభూషణంగారు కొడుకులు ముగ్గురి దగ్గరా చెరో నాలుగు నెలలు ఉంటున్నారు. నాలుగో నెలకి ఒక్క రోజు లేటైనా తరువాతి రోజే కోడళ్ళ దగ్గర్నుంచి ఆజ్ఞలు వచ్చేస్తాయి.

తల్లిదండ్రులు పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తారు. అది సహజం. కానీ అదే ప్రేమని పిల్లలు తల్లిదండ్రుల మీద చూపించరు. వినడానికి ఇది చాలా వింతగా అనిపిస్తుంది. తమాషా ఏమిటంటే పిల్లలు వాళ్ళ పిల్లలని మాత్రం ఎంతో ప్రేమిస్తారు.

ఇదే వేరేవాళ్ళకు జరిగితే, 'ఛస్, అంతా మీ భ్రమ, ఏ కొడుకులు అలా ఉండరని!' అని తీసి పారేసేవారు నాగభూషణంగారు. అదే తన అనుభవంలోకి వచ్చేసరికి తెలుస్తోంది. అందుకే అంటారు 'తనదాకా వస్తే గానీ తెలియదు' అని.

ఏదోలా రోజులు గడుస్తున్నాయి కదా! అనుకుంటున్న సమయంలో మొన్న సాయంత్రం పార్కులో తన స్నేహితుడు సూర్యం కలిసి అతని ఇంట్లోని విషయాలు చెప్పుకొని ఏడ్చాడు.

ఆ రోజు అతని భార్య ఆబ్దికం అయిందిట. అప్పుడు ఇంట్లో జరిగిన

సంఘటన గుర్తు చేసుకొని బాధపడ్డాడు. 'ఆమె చనిపోయేనాటికే ఏ పనీ చేయలేని స్థితిలో ఉండేది. పెద్దతనం వచ్చాక సహజంగానే జిహ్వాచాపల్యం పెరుగుతుంది. ఏదైనా తినాలని ఉందని నోరు తెరిచి అడిగితే, కోడలు చేసిపెట్టేది కాదు. అది నాతో చెప్పుకొని ఏడిచేది. పోనీలే అని బయటినుండి తెచ్చి పెడితే అస్సలు పడేది కాదు. వాంతులు, విరేచనాలు అయ్యేవి. ఇక దాన్ని చిలవలు పలవలు చేసి నా కొడుక్కి చెప్పేది కోడలు. వాడు పూర్వాపరాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడేవాడు. అవన్నీ చూస్తూ బాధని దిగమింగుకోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయేవాడిని. భార్య పోయాక మిగిలిన ఆ ఒంటరితనం గురించి నీకు తెలిసిందే కదా! అది భరించలేం'.

'ఇక ఆబ్దికం రోజున 'అత్తగారికి అది ఇష్టం, ఇది ఇష్టం' అంటూ రకరకాల కూరలు, పిండివంటలు చేసుకొని తిందిరా మా కోడలు. అది బతికున్నప్పుడు ఒక్క గారె తినాలని ఎంతగానో పరితపించిపోయేది. అది బతికున్నప్పుడు లేని విలువ, గౌరవం చచ్చిపోయాక ఇస్తే ఏంటి? ఇవ్వకపోతే ఏంటి?' అని ఏడుస్తున్న తన స్నేహితుడికి ఏ సమాధానం చెప్పలేకపోయారు నాగభూషణంగారు.

అది గుర్తుకొచ్చి, పిల్లలనే చక్రబంధంలో ఎక్కువగా పెద్దవాళ్లే నలిగి పోతున్నారు. ఇప్పటి పిల్లలు రేపు పెద్దలవుతారు కదా! వాళ్ళకి పిల్లలు పుడతారు. వాళ్ళూ పెద్దవారవుతారు. ఇప్పటి పిన్నలు రేపు పెద్దవారై మళ్ళీ వాళ్ళ పిల్లల చేతిలో అగచాట్ల పాలవుతారు. దీనికి అంతం లేదా? దీనికి విరుగుడుగా పిల్లలు పుట్టినప్పటి నుంచి వాళ్లపై విముఖత పెంచుకోవాలా? పెద్ద చిక్కుప్రశ్నే ఇది. ఏం బ్రతుకో!? అనుకుంటూ రైల్లో కూర్చుని మరిన్ని ఆలోచనలలోకి జారిపోయారు నాగభూషణంగారు.

పార్వతి-నాగభూషణం దంపతులకు ముగ్గురూ కొడుకులే పుట్టటంతో చుట్టాల్లో, స్నేహితుల్లో వాళ్ళకో ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఎంతసేపూ పార్వతి ఆలోచనలు కొడుకుల చుట్టూ పెనవేసుకుపోయేవి. జీవితంలో మూడొంతులు కొడుకుల కోసమే గడిపింది. వాళ్ళని చూసుకుంటూ తన అదృష్టానికి తనే మురిసిపోతూ, భవిష్యత్తులో వాళ్ళతో గడపబోయే జీవితాన్ని గురించి కలలు కంటూ ఉన్న సమయంలో ఎదురైన కొన్ని చేదు అనుభవాలు ఆ తల్లి మనసుని గాయపరిచాయి. పిల్లల మీద మమకారంతో పార్వతి చూపున్న అంధురాలయింది.

ఎంతసేపూ వారిని తన పిల్లలుగానే చూస్తోంది తప్ప, కోడళ్ళ భర్తలుగా అంగీకరించ లేకపోయింది. వాళ్ళని తన పొత్తిళ్ళలో పెరిగిన పిల్లలుగానే అనుకుంటోంది గాని, కోడళ్ళకి పాణిగ్రహణం చేయించిన విషయాన్ని గుర్తించలేకపోవటంతో మొదలయ్యాయి గొడవలు.

కొడుకులు ముగ్గురి దగ్గరా తలా కొన్నేసి రోజులు ఉండాలన్న అందమైన ఊహలు కాస్తా చెదిరిపోయాయి. ఈ తల్లి అతి ప్రేమను వాళ్ళు తట్టుకోలేక పోయారు. తల్లి మాటలు వాళ్ళకి చాదస్తంగా అనిపించాయి. 'ఏంటి నాన్నా! మీరైనా చెప్పండి' అన్న పిల్లల మాటే వినాలా!?

'కన్నతల్లిని! కళ్ళలో ఒత్తులేసుకొని పెంచాను వీళ్ళని! వాళ్ళు సంతోషపడితే నేను సంతోషించాను. వాళ్ళకి జ్వరాలు వస్తే వాళ్ళతో పాటు నేనూ లంఖణాలు చేశాను. ఇలా ఒకటా రెండా!? ఈ జీవితమంతా వాళ్ళకే ధారపోసానే! అలాంటిది ఇప్పుడు నా ప్రేమ, అభిమానం వాళ్ళకి పనికిరాకుండా పోయాయా? వేరేవాళ్ళ మొగుళ్ళుగానే పుట్టారా? అంతేలెండి! అడ్డాలనాడు బిడ్డలు గానీ, గడ్డాలొచ్చాక కాదుగా' అని ఆవేదనతో వాపోతున్న పార్వతిని సముదాయిస్తూ

'ఒక్కటి గుర్తుంచుకో పారూ! పిల్లలపట్ల ప్రేమ, అభిమానం ఉండాలి. కాని అది మోతాదు మించకూడదు' అని ఎన్నోసార్లు చెప్పారు నాగభూషణంగారు.

'తమ కాళ్ళమీద తాము నిలబడేవరకే పిల్లలకి తల్లి, తండ్రి కావాలి. రెక్కలు వచ్చేంతవరకే పక్షులు ఒదిగి ఉంటాయి. ఎప్పుడైతే ఎగిరే సత్తువ వచ్చిందో వెంటనే ఎగిరిపోతాయి. అలాగే పిల్లలు కూడా రెక్కలొచ్చిన పక్షులే. వయసుతో పాటుగా వారి భావాలూ మారిపోతాయి. 'తమ భార్యా పిల్లలు, తమ ఇల్లు, తమ సంపాదన' అంటూ వాళ్ళ జీవితాలు వాళ్ళు నిర్మించుకుంటున్నప్పుడు తల్లితండ్రులతో పెంచుకున్న అనుబంధం, ఆత్మీయత పలచబడిపోతాయి. అప్పుడు మనలని వాళ్ళు ఒక బాధ్యతగానే చూస్తారు తప్ప ప్రేమ, బంధం తగ్గిపోతుంది. కోడళ్ళు వచ్చాక నువ్వు కొడుకులని పగ్గాలు వేసి ఉంచలేవు. భర్తలు భార్య చాటున ఉండటం సహజం. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. మన బాధ్యత తీరింది. వాళ్ళు తండ్రులయ్యారు. ఇక మనం ప్రేక్షక పాత్ర వహించాలి' అని ఎన్ని చెప్పినా పార్వతి సమాధాన పడలేకపోయేది. ఒకరకంగా మనోవేదనతో కుంగిపోయింది.

ఆ తరువాత కొంతకాలానికే ఈ లోకం నుంచి వెళ్ళిపోయింది.

ఇదిగో.. ఈ రోజు సూర్యం మాటలు ఎందుకో తన గతాన్ని గుర్తు చేసాయి. ఇంకోవిధంగా తన కర్తవ్యాన్ని కూడా బోధించాయి. అందుకే పిల్లలు ముగ్గురికి కలిపి ఒక ఉత్తరం రాసిపెట్టి వచ్చేసారు నాగభూషణంగారు.

అందులో.. తను బతికున్నంత కాలమూ ఊళ్ళో ఉన్న ఇంటి మీద వచ్చే అద్దె తన ఎకౌంటులోకి వచ్చేటట్లు, తదనంతరం ఆ ఇల్లు ముగ్గురికి చెందేటట్లు రాశారు. అలాగే తను రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బుని ఫిక్స్డ్ డిపాజిట్‌లో వేశారు. తన తదనంతరం అది ఆరుగురు మనవలకి సమానంగా చెందేటట్లు రాశారు.

❖ ❖ ❖

ఇక తనకు పెన్షన్ ఎలాగూ వస్తుంది. దానితో తన జీవనం గడిచిపోతుంది కాబట్టి దిగులులేదు. ఇక వెంటనే బంధవిముక్తుడై కాశీకి బయలుదేరారు నాగభూషణంగారు తన శేషజీవితాన్ని అక్కడే గడపాలనే దృఢనిశ్చయంతో.

కాశీకి బయలుదేరిన రైలు సాయంత్రం అయేసరికి నాగపూర్ వచ్చింది. అప్పటికి నాగభూషణంగారికి రాజారావు దంపతులతో పాటు, బామ్మగారి ఫ్యామిలీతో కూడా పరిచయం అయింది. అలాగే తన పక్కనే చంద్రశేఖర దీక్షితులు బెరుకు బెరుకుగా అందరినీ చూస్తూ ముడుచుకొని కూర్చున్నాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడటం లేదు. తన వివరాలు వెల్లడించనూ లేదు. జాలేసి నాగభూషణం గారే పలకరించారు. పొడి పొడిగా మాట్లాడాడు. కొంచెంసేపటికి నాగభూషణంగారి భుజం మీద వాలి నిద్రపోయాడు. అన్ని బంధాలు తెంపుకొని వచ్చేస్తుంటే, ఇదేమిటి కొత్త బంధం? ఏదో హక్కున్నట్టు నన్ను చుట్టుకుంది! అని నవ్వుకున్నారు నాగభూషణంగారు.

❖ ❖ ❖

**రాజారావు, శ్యామల దంపతులు**

'ఇదిగో ఇలా రా! మన కాశీ ప్రయాణం ఖాయమయినట్లే!' అని సంతోషంగా చెప్పాడు భార్య శ్యామలతో రాజారావు.

'అమ్మయ్య! ఇన్నాళ్ళకి నా కోరిక తీరబోతోంది' అంది శ్యామల.

'ఇదిగో! నువ్వు అలా ఈస్ట్‌మన్ కలలు కనకు. వెళ్ళేంతవరకు ఓపిక పట్టు. ఒకవేళ ఏదైనా అడ్డంకి వచ్చి ప్రయాణం రద్దయితే నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతావు' అన్నాడు రాజారావు.

'అబ్బ చాల్లెద్దురు.. ఎప్పుడూ నన్ను ఆడిపోసుకోవటమే మీ పని' అంది.

'ఇదిగో! అపుడే అందరికీ డప్పు వేయకు శ్యాము. ముఖ్యంగా మీ వదినకి. ఆవిడకి తెలిస్తే ప్రపంచమంతా తెలిసినట్లే' అని ఓ సెటైర్ వేశాడు.

ఆ మాట నిజం కాబట్టి మారు మాట్లాడకుండా ఊరుకుంది శ్యామల. ఎవరితోనో ఫోన్ మాట్లాడుతున్నాడు రాజారావు.

'అవునండీ! కాశీ, గయా, అయోధ్య, ప్రయాగ. అదేనండీ! త్రివేణీ సంగమం వెళ్ళాలి. నూట నలభై నాలుగేళ్ళకోసారి వచ్చే కుంభమేళాకు వెళ్ళలేదు. ఇప్పుడు వెళ్ళాలనుకున్నాం. మేం ఇద్దరమే! నేనూ, మా ఆవిడా! అసలు నా కన్నా కూడా ఆవిడకే అన్నీ తెలుసు. మీరు ఏమాత్రం సరిగ్గా ప్లాన్ చెయ్యకపోయినా నా పని గోవిందా! సరేనా. ఆ.. మళ్ళీ చేయండి అన్ని వివరాలతో. ఉంటాను' అంటూ ఫోన్ పెట్టేశాడు.

'ఏవిటో నా పేరు వినిపించింది!' అంది శ్యామల.

'అబ్బ అదేదో సినిమాలోలా మాట్లాడావు కదే'.

'చాల్లెండి! అసలు విషయం చెప్పండి!'.

'అదే! ఎప్పటినుంచో నీ కోరిక కదా కాశీ చూడాలని. ఆ పని మీదే ఉన్నాను. ఎవరో టూర్ కండక్ట్ చేసేవాళ్ళు ఉన్నారట. వాళ్ళు కాశీలోనే ఉంటారు. స్టేషన్‌కి వచ్చి మనలని రిసీవ్ చేసుకుంటారట. అక్కడ ఏమేమి చూడాలో అవన్నీ వాళ్ళే దగ్గరుండి చూపిస్తారట. ఆ వివరాలు మాట్లాడుతున్నా' అన్నాడు రాజారావు.

చూస్తుండగా ప్రయాణం రేపట్లోకి వచ్చేసింది. రెండు రోజుల ముందు నుంచే అన్నీ సర్దుకొని ఉండటం వల్ల పెద్ద కంగారు పడలేదు. రెండు లంచులు, ఒక డిన్నర్, ఒక బ్రేక్‌ఫాస్ట్‌కి సరిపడే సరంజామా పెట్టుకున్నారు. ఓసారి అవన్నీ గుర్తుకు తెచ్చుకొని ఇద్దరూ తృప్తి పడ్డారు.

రైల్లో కూర్చున్న శ్యామల తన స్నేహితురాలికి ఫోన్ చేసి మాట్లాడుతోంది.

రాజారావు ఓసారి చుట్టుపక్కల చూశాడు. అందరి మాటలు కలగాపులగంగా వినిపిస్తున్నాయి. తమ బోగి నిండుగానే ఉంది అనుకున్నాడు.

రాజారావు బ్యాంకులో పనిచేస్తూ రెండేళ్ల క్రితం రిటైర్ అయ్యాడు. ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరూ ఇంజనీరింగ్ చేసి ఎమ్.ఎస్. చెయ్యడానికి అమెరికా వెళ్లి

అక్కడే ఉద్యోగాలలో స్థిరపడ్డారు. పెద్దవాడికి నాలుగేళ్ల క్రితం, రెండోవాడికి కిందటి ఏడాది పెళ్లిళ్లు అయ్యాయి. రాజారావు, శ్యామల రెండుసార్లు అమెరికా వెళ్లి వచ్చారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు చాలా ప్రదేశాలు చూసినా కాశీ మటుకు వెళ్ళలేదు. దానికి రాజారావు వేరే ప్రణాళిక వేసుకున్నాడు. ఆ ప్రణాళికలో భాగమే ఇప్పటి ఈ ప్రయాణ సన్నాహాలు.

సాధారణ మధ్య తరగతిలో పుట్టిన రాజారావుకి ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు. వీళ్ళందరి బాధ్యత పెద్దకొడుకైన రాజారావు మీదే పడింది. రాజారావు తండ్రి మున్సిపల్ ఆఫీస్‌లో గుమస్తా. ఇంకా తాత, నాయనమ్మ అందరివీ కలిపి రోజూ పది విస్తళ్ళు లేచేవి ఆ ఇంట్లో. అందరి ఇళ్ళల్లోలాగే రాజారావుకి కూడా అవసరమైన త్యాగాలు చేయవలసి వచ్చేది. ఖర్చులు ఎక్కువ, సంపాదన అంతంత మాత్రం. అందుకే సాధ్యమయినంత పొదుపుగానే ఉండేవాడు.

రాజారావుకి చిన్నప్పటి నుండి ఇంజనీరింగ్ చేయాలని ఉండేది. కానీ అతికష్టం మీద బి.కాం. చదివించాడు తండ్రి. తను రిటైర్ అయ్యే లోపల నానా తంటాలుపడి తమ ఊళ్లోనే ఉద్యోగం వేయించాడు కొడుకు రాజారావుకి. 'కొడుకును బయటకి పంపితే, ఈ బాధ్యతలు వదిలేసి వెళ్ళిపోతాడేమో? అప్పుడు మిగతావాళ్ళ గతేం కాను?' అనే భయంతో రాజారావు తండ్రి రాజారావుకి తనకు వరుసకి బావమరిది అయిన శంకరం కూతురు శ్యామలనిచ్చి పెళ్లి చేసేశాడు.

కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టింది కొత్త కోడలు శ్యామల. నిజానికి శ్యామల అత్త భ్రమరాంబ శ్యామలకి మరీ కొత్తమనిషి కాదు. అయినప్పటికీ 'కోడలంటే తమ నుంచి కొడుకును వేరు చేసేది' అన్న భావనకి తరతరాలుగా మన సమాజం అంటుకుపోయింది. అందుకే శ్యామల ఏ పని చేసినా వంకలు పెడుతూ, ఏదో రకంగా సాధిస్తుండేది భ్రమరాంబ. అవన్నీ విని విని అలవాటు పడిపోయింది శ్యామల. మరికొన్నాళ్ళ తరువాత అసలు పట్టించుకోవడమే మానేసింది.

కాలక్రమంలో పెద్ద ఆడపడచు పెళ్లి చేశారు రాజారావు, శ్యామల దంపతులు. 'పెద్ద మరిదిని ఏదైనా ప్రొఫెషనల్ కోర్స్‌లో జాయిన్ చేస్తాను' అన్నాడు రాజారావు. 'చూసుకోండి! కష్టపడేది, భారాన్ని మోసేది మీరు. అయినా మన పిల్లల సంగతి కూడా ఆలోచించాలి కదా' అంది శ్యామల. అదేం పెద్ద భవంతి కాదు. కాబట్టి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kasipatnam+Chudarababu**

* * *